
సాక్షి గుంటూరు

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



యోగాలో శిక్షణ

తాడికొండ: మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో శనివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట రామారావు మాట్లాడారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 577.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,086 క్యూసెక్కులు వదిలారు.

తమలపాకుల అలంకరణ



తెనాలి: మారీసుపేటలోని బాలా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో వీరాంజనేయ స్వామిని శనివారం తమలపాకులతో అలంకరించారు. హారతి, మంత్ర పుష్పం సమర్పించారు.

న్యూస్‌రీల్

సబ్‌జైలు సందర్శన



సత్తెనపల్లి: సత్తెనపల్లి సబ్ జైలును గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ పార్థసారథి, గుంటూరు జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) లీలావతి శనివారం సందర్శించారు. సబ్ జైలులోని నిందితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించారు. సరుకుల నాణ్యతను, ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్, ప్యానల్ న్యాయవాది బి.ఎల్ కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్’



నరసరావుపేట రూరల్: పెద్దచెరువులోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కార్యాలయం ప్రాంగణంలోని డివిజన్ కార్యాలయం, ఏరియా పశువైద్యశాల, పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రాంగణాన్ని శుభ్రపరిచి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, డీడీఏ డాక్టర్ సి.కోటిరత్నం, ఏడీఏ డాక్టర్ కె.కళావతి, ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

స్కేటర్ జెస్సీరాజ్‌కు బాల పురస్కార్



మంగళగిరి: పట్టణానికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ జెస్సీరాజ్‌ను ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ –2025 వరించింది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఈ అవార్డు అందుకోనున్నారు. ఏటా 25 మంది బాలలకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ఇస్తుంటుంది. వచ్చే ఏడాది జాబితాను ఇటీవల ప్రకటించింది. ఈ సందర్భంగా జెస్సీరాజ్‌ను పలువురు అభినందించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1616 క్యూసెక్కుల విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 68, తూర్పు కెనాల్‌కు 63, పశ్చిమ కెనాల్‌కు 56, నిజాంపట్నం కాలువకు 151, కొమ్మమూరు కాలువకు 1310 క్యూసెక్కులు విడుదల చేశారు.

వస్తువుల కొనుగోళ్లపై అవగాహన



నరసరావుపేట: వస్తువుల కొనుగోళ్లలో అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని, విద్యార్థులు స్కూల్ స్థాయి నుంచే దీనిపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. జేసీ గనోరే అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లీగల్ మెట్రాలజి శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ అల్లు రయ్య మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు తూనికలు, కొలతల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని డెమో రూపంలో చూపించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ పిల్లి యష్ఫునారాయణ, డీసీపీసీ మెంబర్ కె.మస్తాన్‌రావు, జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి బి.నారదముని వివిధ వస్తువుల కొనుగోలు గురించి వివరించారు. కలెక్టర్ చేతుల మీదుగా విజేతలకు మొదటి బహుమతి రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు, తృతీయ బహుమతి రూ.1500లతో పాటు ప్రసంశా పత్రాలు, మెమెంటోలను అందజేశారు. డీఈఓ చంద్రకళ, అధికారులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



దుస్తులు పంపిణీ చేస్తున్న తెనాలి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నాబత్తుని శివకుమార్



అన్నదానం చేస్తున్న ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

ప్రగతి ప్రదాతకు ప్రజా దీవెన

జననేత జన్మదినాన ఉప్పొంగిన అభిమానం

- ఘనంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు
- వాడవాడలా సేవా కార్యక్రమాలు, కేక్ కటింగ్‌లు
- పండుగ వాతావరణాన్ని తలపించేలా కార్యక్రమాలు

పట్నంబజారు: సంక్షేమ సారథి వందేళ్లు చల్లగా ఉండాలని వాడవాడలా ప్రజలు దీవించారు. రాష్ట్ర రాజకీయ చరిత్ర పుటల్లో తనకంటూ ఒక అధ్యాయం సృష్టించుకున్న జననేత జన్మదినాన్ని పండుగలా నిర్వహించుకున్నారు. వైఎస్సార్ సీపీ అంటే.. సేవా కార్యక్రమాలకు ముందుంటుందని అభిమానులు చాటిచెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి.

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి వైఎస్ జగన్ జన్మదినాన్ని వేడుకగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్, నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ నేత మేకతోటి దయాసాగర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన 162 మందిని అభినందించి, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.



గుంటూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మోదుగుల

తాడికొండ నియోజకవర్గంలో...

తాడికొండలో వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ సమన్వయకర్త, గుంటూరు నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్, రావిచెట్టు సెంటర్లలో కేకు కట్ చేసి, వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. తుళ్లూరు మండలం దొండపాడు వేడుకల్లో కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు, పండ్లు అందించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మేడికొండూరు మండల పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్‌లో డైమండ్ బాబు పాల్గొన్నారు. ఫిరంగిపురం నిర్మల్ హృదయ్ సేవాసంస్థలో జరిగిన వేడుకలకూ హాజరయ్యారు.

పొన్నూరులో...

పొన్నూరు పట్టణ కార్యాలయంలో వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, నాయకులు కేక్ కట్ చేశారు. లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమాల్లో అన్నదానం నిర్వహించారు. చేబ్రోలులో కేక్ కటింగ్ జరిగింది. పెదకాకాని మండలంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో అంబటి మురళీకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు. బాజీబాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు.



కేకు కట్ చేస్తున్న అంబటి మురళీకృష్ణ

మంగళగిరిలో...

మంగళగిరి నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మంగళగిరి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. మెగా రక్తదాన శిబిరంలో దాదాపు 100 మంది పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో తాడేపల్లి కన్వీనర్లు ఆకురాతి రాజేష్, బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

ప్రత్తిపాడు నియోజకవర్గంలో...

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏటుకూరు గ్రామంలో ఉన్న కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ కేక్ కట్ చేశారు. అన్నదానం జరిగింది. అన్ని మండలాల్లో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు, కేక్ కటింగ్‌లను కార్యకర్తలు, నాయకులు నిర్వహించారు. పెదనందిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్ మండలాల్లో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.

తెనాలి నియోజకవర్గంలో...

వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు తెనాలి నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు, కేక్ కటింగ్‌లు, పండ్లు పంపిణీ జరిగాయి. కొల్లిపర, తూములూరు గ్రామంలో వేడుకలు నిర్వహించారు. తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ కొల్లిపర గ్రామంలో వైఎస్ జగన్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి, దుప్పట్లు పంపిణీ చేశారు. తూములూరు గ్రామంలో ఈమని హరికోటిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని వేడుకలు జరిగాయి. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుంటూరు తూర్పులో...

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో కేక్ కటింగ్‌లు నిర్వహించారు. కష్టాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలకు ఆర్థిక సాయం అందించారు. పలువురికి కుట్టుమిషన్లు, జిరాక్స్ మిషన్లు, జీజీహెచ్‌లో పండ్లు పంపిణీ చేశారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, వివిధ ప్రాంతాల్లో అన్నదానం చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం

- ముందుగానే ఇంక్రిమెంట్ జమ
- ఎవరైనా ఫిర్యాదు చేస్తే నగదు వెనక్కి

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘంలో కొందరు ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లను సమయానికంటే ముందుగా ఇవ్వటం పరిపాటిగా మారింది. ఎవరైనా గుర్తిస్తే చెల్లించిన నగదును వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వాసిమళ్ల కిషోర్ మున్సిపల్ కార్మికుడు కాగా, 24 సంవత్సరాల స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్‌ను 2019లో ఇవ్వాల్సి ఉంది. కానీ మున్సిపల్ కార్యాలయంలో ఆ సమయంలో పనిచేసిన క్లర్క్ అతనికి 2018లోనే ఇంక్రిమెంట్‌ను జీతంతో కలిపి విడుదల చేశారు. అప్పటి నుంచి అతడు ఆ ఇంక్రిమెంట్ నగదు డ్రా చేస్తూ వచ్చాడు. 2024లో 30 సంవత్సరాల ఇంక్రిమెంట్ ఇవ్వాలని అర్జీ పెట్టుకున్నాడు. ఆయన అభ్యర్థన మేరకు క్లర్క్ బిల్లు తయారు చేసి సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపారు. అక్కడున్న ఉద్యోగి సర్వీస్ రిజిస్టర్‌ను పరిశీలించారు. 2025లో ఇంక్రిమెంట్ వేయాలని, ఈ ఏడాది కాదంటూ రిమార్కు రాసి వెనక్కి పంపారు. అప్రమత్తమైన సదరు క్లర్క్ ఏడాది ముందుగా ఇంక్రిమెంట్ నగదు చెల్లించామని బాధితుడికి తెలిపారు. ఆ నగదు రూ.3 లక్షలు వెంటనే వెనక్కి ఇవ్వాలని కోరారు. తన దగ్గర డబ్బులు లేవని బాధితుడు చెప్పాడు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లే పనిలో క్లర్క్ ఉన్నట్లు సమాచారం. అలాగే ఆ సమయంలో ఇదే విధంగా మరో పది మంది కార్మికులకు ఇంక్రిమెంట్ ముందుగా వేశారనే ప్రచారం జరుగుతోంది. అప్పటి క్లర్క్ ముందుగా ఇంక్రిమెంట్ వేయడానికి కొంత నగదు తీసుకున్నాడనే ఆరోపణలున్నాయి. కమిషనర్ బండి శేషన్నను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. క్లర్క్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకుంటానని చెప్పారు.



తెనాలి మున్సిపల్ కార్యాలయం

చెడు వ్యసనాలతో జీవితాన్ని బలి చేసుకోవద్దు




ప్రసంగిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

విద్యార్థులకు డీజీపీ సూచన

ఏఎన్‌యూ: చెడు వ్యసనాలకు లోనై జీవితాలు బలి చేసుకోవద్దని విద్యార్థులకు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం నిర్వహించిన ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు డీజీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తూ.. నేడు యువతను పట్టిపీడిస్తున్న సైబర్ క్రైమ్, డ్రగ్స్ ముప్పు వంటి సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు ప్రసంగిస్తూ సాంకేతికత అంశాలపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతోందని, దానిలో ఉన్న అపార ఉపాధి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉద్యోగంతోనే సరిపెట్టుకోకుండా సమాజ స్థితిగతులు మార్చే వారిగా విద్యార్థులు ఎదగాలన్నారు. విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ లేదని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన స్కిల్ ఓరియెంటెడ్ కార్యక్రమాలు, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ తరగతులను, ఉద్యోగాలు పొందేందుకు క్యాంపస్ డ్రైవ్‌లను నిరంతరం చేపట్టనున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య కే రత్న షీలామణి మాట్లాడుతూ సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులకు సమయపాలన, క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.సిద్ధయ్య, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి ప్రసంగించారు. పలువురు అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలు రైళ్ల సేవల్లో మార్పులు



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని విజయవాడ–ఖాజీపేట మధ్య ఇంజినీరింగ్ పనుల నేపథ్యంలో పలు రైళ్ల సేవల్లో మార్పులు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం వెల్లడించారు.

- నంబర్ 12705 గుంటూరు–సికింద్రాబాద్, 12706 సికింద్రాబాద్ – గుంటూరు రైళ్లు ఈ నెల 28, 29, జనవరి 2, 5, 7, 8, 9 రద్దు చేశారు.
- 07277 మిర్యాలగూడ–నడికుడి రైలు ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు, 07973 నడికుడి–మిర్యాలగూడ రైలు ఈ నెల 27 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు, 07974 మిర్యాలగూడ – కాచిగూడ రైలు ఈ నెల 27 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు, 07791 కాచిగూడ – నడికుడి, 07792 నడికుడి–కాచిగూడ రైళ్లు ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు రద్దు అయ్యాయి.

పాక్షిక రద్దు

- నంబర్ 17201 గుంటూరు–సికింద్రాబాద్ రైలు, 17202 సికింద్రాబాద్–గుంటూరు రైలును ఈ నెల 27 నుంచి జనవరి 9వ తేదీ వరకు పాక్షికంగా రద్దు చేశారు.

దారి మళ్లింపు...

- నంబర్ 18519 విశాఖపట్నం–ముంబయి ఎల్‌టీటీ రైలును ఈ నెల 26 నుంచి జనవరి 8వ తేదీ వరకు గుంటూరు మీదుగా దారి మళ్లించనున్నారు. 18045 షాలీమార్–హైదరాబాద్ రైలు జనవరి 6– 8వ తేదీ వరకు, 18046 హైదరాబాద్–షాలీమార్ రైలు 7– 9వ తేదీ వరకు, 17205 సాయినగర్ షిరిడీ – కాకినాడ పోర్ట్ రైలు 7వ తేదీన, 17206 కాకినాడ పోర్ట్ – సాయినగర్ షిరిడీ రైలు జనవరి 8వ తేదీన, 17208 మచిలీపట్నం–సాయినగర్ షిరిడీ రైలు జనవరి 7వ తేదీన, 11019 ముంబయి సీఎస్ఎంటీ–భువనేశ్వర్ రైలు జనవరి 6– 8వ తేదీ వరకు, 11020 భువనేశ్వర్–ముంబయి సీఎస్ఎంటీ రైలు జనవరి 6 – 8వ తేదీ వరకు, 22849 షాలీమార్–సికింద్రాబాద్ రైలు జనవరి 1, 8 తేదీల్లో, 20833 విశాఖపట్నం–సికింద్రాబాద్ రైలు జనవరి 8, 9 తేదీల్లో, 12774 సికింద్రాబాద్–షాలీమార్ రైలును జనవరి 7వ తేదీ వరకు గుంటూరు డివిజన్ మీదుగా దారి మళ్లించారు.

ఎస్సీ హాస్టల్‌లో పాపకు జన్మనిచ్చిన విద్యార్థిని

గుంటూరు నగరంలో ఘటన

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహం(పరివర్తన భవన్)లో ఓ విద్యార్థిని శుక్రవారం రాత్రి పాపకు జన్మనిచ్చింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని గుంటూరు నగరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో బీ ఫార్మసీ చదువుకుంటూ కలెక్టరేట్ బంగ్లా రోడ్డులోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటోంది. శుక్రవారం రాత్రి విద్యార్థిని తన స్నేహితురాలి సాయంతో పాపకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న హాస్టల్ సిబ్బంది వెంటనే తల్లి, బిడ్డను జీజీహెచ్‌కు తరలించారు. హాస్టల్‌లో ఇంత జరుగుతున్నా వార్డెన్‌కు ఏమీ తెలియకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జరిగిన ఘటనపై ఏఎస్‌డబ్ల్యూవో చెంచులక్ష్మిని వివరణ కోరగా హాస్టల్ వార్డెన్‌కి విద్యార్థిని కడుపుతో ఉన్న విషయం తెలియదని, వార్డెన్ ఎప్పుడు అడిగినా ఆరోగ్యం బాగానే ఉందని చెబుతూ ఉండేదని చెప్పారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,300** గరిష్ఠం : రూ. **4,100**

మోడల్ ధర రూ. **3,800**

క్లుప్తంగా

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలపై పోలీసుల అత్యుత్సాహం

తాడికొండ: వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా తాడికొండలో ఏర్పాటు చేసిన మైకులను తొలగించాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారు. కార్యకర్తలు, నాయకులు చిన్న పాటి మైకులు ఏర్పాటు చేసి శనివారం వేడుకలు నిర్వహించుకుంటున్నారు. తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయంటూ ఆంక్షల పేరుతో పోలీసులు ఆ మైకులు తొలగించారు. గతంలో ఎన్నడూ లేనంతగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ జన్మదిన వేడుకల విషయంలో పోలీసులు అతిగా వ్యవహరించడంపై స్థానికులు మండిపడ్డారు.

మంగళగిరి జీజీహెచ్ ఆర్‌ఎంఓగా డాక్టర్ ప్రియం వద

గుంటూరు మెడికల్ : మంగళగిరి జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ ఎం.ప్రియం వదను నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డాక్టర్ ప్రియం వద నెల్లూరు జిల్లా కందుకూరులో డెప్యూటీ డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ పి.అమృతమ్‌జాన్‌ను నియమించారు. డాక్టర్ అమృతమ్ జాన్ ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డెప్యూటీ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బాపట్ల డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ టి.వెంకటేశ్వర్లును ఒంగోలు డీఎంహెచ్‌ఓగా నియమించారు.

నాయకత్వ లక్షణాలు పెంచే యువజనోత్సవాలు



పెదకాకాని: యువజనోత్సవాలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంచుతాయని విజ్ఞాన్ నిరులా ప్రిన్సిపల్ పాతూరి రాధిక అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ స్థాయి యువజనోత్సవం వివా- వీవీఐటీ 2024-25 వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాతూరి రాధిక మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా కృషి చేయాలని సూచించారు. ది వరల్డ్ ఈజ్ వన్ నేపథ్యాన్ని ఈ కార్యక్రమాన్ని ఎంచుకోవడంతో దానిని ప్రతిబింబించేలా కళాశాల ప్రాంగణం మొత్తం ప్రపంచ దేశాలలోని సంస్కృతులు, పురాణాల ఆకృతులతో తీర్చిదిద్దారు. సాంస్కృతిక, సాంకేతిక, క్రీడా విభాగాల నుంచి 94 అంశాలలో పోటీలు నిర్వహించారు. వివిధ కళాశాలకు చెందిన 4,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాన్సన్ అండ్ జాన్సన్ ఐటీ మేనేజర్ ఆదిశేషారెడ్డి, అమెరికన్ ప్రొఫెసర్ డాక్టర్ దండు రాజు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేయాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్, వేదికపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు వెస్ట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. దినకర్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర విజన్, ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ ఆకాంక్షలకు అనుగుణంగా పథకాలు క్షేత్ర స్థాయిలో పూర్తి చేసేలా పనిచేయాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగు పరుచుకోవాలని తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి పంటకుంటల నిర్మాణం, పంట కాలువల పూడికతీత పనులు చేట్టాలన్నారు. జల్‌జీవన్ పథకం లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. గతంలో జరిగిన పనుల్లో నాణ్యతను పరిశీలించాలని పేర్కొన్నారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా ఇల్లు నిర్మించే లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలు నివాసం ఉండే విధంగా తీర్చిదిద్దాలన్నారు. నమో డ్రోన్ ద్వారా అందించే వ్యవసాయ డ్రోన్‌ల వలన కలిగే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పీఎం ఫసల్ బీమా యోజన, కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో అందించే ఎరువులు సక్రమంగా రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నగరంలో మూడు ప్రధాన సమస్యలు ఉన్నాయన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, మంచినీటి సరఫరా, మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, డీపీఓ శేషశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోటి ఆశలతో వెళ్లి.. విగతజీవిగా మారి...

- అమెరికాలో రోడ్డు ప్రమాదంలో తెనాలి యువతి మృతి
- భౌతికకాయాన్ని చూసి కుటుంబం కన్నీరుమున్నీరు



భౌతికకాయం వద్ద కుటుంబసభ్యులు

తెనాలి: కోటి ఆశలతో ఎంతో సంతోషంగా అమెరికాలో చదువు నిమిత్తం వెళ్లిన తెనాలి యువతి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఆమె భౌతికకాయం రావడంతో చూసిన కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. తెనాలి యువతి నాగశ్రీ వందన పరిమళ (26) మృతదేహం శుక్రవారం రాత్రి పొద్దుపోయాక స్వగృహానికి చేరుకుంది. టెనస్సీ స్టేట్‌లోని మెంఫిస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన పరిమళ, ఈ నెల 16న జరిగిన స్నాతకోత్సవంలో పట్టా తీసుకోవాల్సి ఉంది. దురదృష్టవశాత్తు దీనికి మూడు రోజుల ముందు కారులో ప్రయాణిస్తుండగా ట్రక్ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. అంతకు అర్ధగంట ముందే తల్లిదండ్రులతో ఆమె ఫోనులో మాట్లాడారు. తెనాలి గాంధీనగర్‌కు చెందిన సూరె గణేష్, రమాదేవి దంపతులకు ముగ్గురు కుమార్తెల్లో పరిమళ ఒకరు. ఎంఎస్ చేసేందుకు 2022లో అమెరికాకు వెళ్లారు. చదువు పూర్తయి ఇంటికి రావాల్సిన కుమార్తె ప్రాణాలు కోల్పోవడాన్ని కన్నవారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె భౌతికకాయాన్ని సాధ్యమైనంత త్వరగా స్వస్థలానికి చేరుస్తామన్న 'తానా' ప్రతినిధుల మాటలతో ఇన్నాళ్లు ఎదురుచూస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోనే పరిమళ విగతజీవిగా బాక్సులో ఇంటికి చేరింది. కుటుంబసభ్యులు, బంధుమిత్రుల కడ చూపు కోసంశనివారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో బాక్సును తెరిచారు. కుమార్తె భౌతికకాయాన్ని చూసిన తల్లిదండ్రులు రమాదేవి, గణేష్, తోబుట్టువులు నాగామృతవల్లి, యోగశ్రీ హర్షిత కన్నీరుమున్నీరుగా విలపించారు. వారిని ఓదార్చటం బంధుమిత్రులకు కష్టతరమైంది. అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు.

పరిమళ కుటుంబానికి మనోహర్ పరామర్శ

తెనాలి: అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మరణించిన తెనాలి యువతి సూరె నాగశ్రీ వందన పరిమళ కుటుంబసభ్యులను శనివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. పరిమళ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రమాదం వివరాలను ఆమె తల్లి, తోబుట్టువులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.

క్రీడా పోటీలతో మేలు



గుంటూరు రూరల్: ఉద్యోగులకు క్రీడా పోటీలతో ఎంతో మేలు ఉంటుందని ఏపీ అదనపు కేంద్రీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి. వీరభద్రస్వామి తెలిపారు. శనివారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ పీజీ కళాశాలలో ఈపీఎఫ్‌వో సౌత్ జోన్ కబడ్డీ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... ఉద్యోగులకు రెండు దశాబ్దాలుగా ఇలాంటి క్రీడల పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడ జోనల్ కార్యాలయం ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ శిఖర్‌శర్మ మాట్లాడుతూ ఉద్యోగుల మధ్య పోటీలు వారి పని సామర్థ్యాన్ని పెంచుతాయన్నారు. గుంటూరు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ మాట్లాడుతూ ఆటలపోటీల నిర్వహణ సంతోషకరమన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. విజ్ఞాన్ నిరుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాధిక, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనూరాధలు పీఎఫ్ కమిషనర్లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఉదయం ఏపీపై కర్నాటక, కేరళపై తమిళనాడు విజయం సాధించాయి. అనంతరం కర్నాటక, తమిళనాడు మధ్య జరిగిన పోటీలో కర్నాటక గెలిచింది ఆల్ ఇండియా కబడ్డీ టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. కార్యక్రమంలో ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ 2 ఇంద్రనీల్‌ఘోష్, సహాయ కమిషనర్‌లు మాధవశంకర్, ఎ. విజయలక్ష్మి, ఆర్‌ఎస్‌పీబీ సభ్యుడు డీసీ రామారావు, రిక్రియేషన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, క్రీడా కార్యదర్శి కృష్ణార్జున, సాంస్కృతిక కార్యదర్శి సబీహాబేగం, సుప్రజ, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి దేవుడిచ్చిన వరం

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని
- ఘనంగా సిబార్ దంత వైద్య కళాశాల వార్షికోత్సవం
- ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు ప్రదానం



విద్యార్థులకు గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్‌లు అందజేస్తున్న మంత్రి పెమ్మసాని

పెదకాకాని: దంత వైద్య వృత్తిని దేవుడిచ్చిన వరంలా భావించి ఉత్తమ డాక్టర్లుగా ఎదగాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో శనివారం కళాశాల వార్షికోత్సవం ఘనం నిర్వహించారు. పెమ్మసాని మాట్లాడుతూ ఒక విజయవంతమైన మార్గంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఎంతో అదృష్టవంతులన్నారు. జీవితంలో ఎంత ఆనందం ఉంటుందో అదే స్థాయిలో సవాళ్లు కూడా ఎదురవుతుంటాయని, వాటిని అనునిత్యం ఎదుర్కొనేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. దంత వైద్య రంగంలో ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకుని ఉన్నతంగా రాణించాలన్నారు. వైద్య సేవలు అందించడంతోపాటు పేషెంట్లతో మాట్లాడటం కూడా ముఖ్యమన్నారు. కళాశాలలో విద్యాబోధన జరుగుతున్న విధానాన్ని ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరు జిల్లాలో సిబార్ దంత వైద్య కళాశాల వంటి కళాశాలలు ఉండటం ఈ ప్రాంత వాసులు అదృష్టంగా భావించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సిబార్ డెంటల్ కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ టి కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ రేవతి, డాక్టర్ ఎల్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల విక్రయంలో విజయ్ డిజిటల్ మేటి



మంగళగిరి: ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల విక్రయంలో విజయ్ డిజిటల్ షోరూమ్ మేటి అని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తెలిపారు. పాత బస్టాండ్ వద్ద షోరూమ్‌ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. యజమానులు జువ్వాది గంగాధర రావు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖో ఖో పోటీలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న సుబ్రహ్మణ్యం, సత్యపాల్‌కుమార్, కేవీ బ్రహ్మం, అనితాదేవి



ఖో ఖో ఆడుతున్న క్రీడాకారులు

- తలపడిన అంతర కళాశాలల క్రీడాకారులు
- లీగ్‌లోకి ప్రవేశించిన నాలుగు జట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని ఖో ఖో పురుషుల అంతర కళాశాలల పోటీలను శనివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విద్యానిధి కమిటీ అధ్యక్షుడు పొట్టి సుబ్రహ్మణ్యం, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీ సత్యపాల్ కుమార్ నూతన ఖో ఖో, హ్యాండ్ బాల్, లాంగ్ జంప్ ట్రాక్స్, కోర్టులను ప్రారంభించారు. పొట్టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక వికాసానికి క్రీడలు ముఖ్యమని చెప్పారు. ఇలాంటి అవకాశాలను క్రీడాకారులు వినియోగించుకుని జీవితంలో ముందుకు వెళ్లాలని సూచించారు. ఆచార్య సత్యపాల్ కుమార్ మాట్లాడుతూ.. క్రీడాకారులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సైతం ఉన్నాయని చెప్పారు. పోటీలకు టీజేపీఎస్ కళాశాల, ఏఎన్‌యూ వ్యాయామ విద్య కళాశాల, ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, నరసరావుపేటలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల, ఏఎం రెడ్డి కళాశాల, కృష్ణవేణి డిగ్రీ కళాశాల, విక్టరీ డిగ్రీ కళాశాల, డీసీఆర్ఎం డిగ్రీ కళాశాల, గుంటూరులోని సిమ్స్ కళాశాల, కేవీడీసీ కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. విక్టరీ, డీసీఆర్ఎం, వాగ్దేవి, కృష్ణవేణి కళాశాలల జట్లు లీగ్‌లోకి ప్రవేశించాయి. ఆదివారం సెమీ ఫైనల్, ఫైనల్స్ ఉంటాయి. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, కోశాధికారి వి.కృష్ణానంద్, శాప్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, డీఎస్‌డీవో పి. నరసింహారెడ్డి, ఏజీకేఎం డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డి. కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా ఖో ఖో అధ్యక్షుడు వి. వీరభద్రా రెడ్డి, కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఆర్. శివాజీ, డిగ్రీ ఇన్‌చార్జ్ భాను మురళీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషను డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ

- తెనాలి డివిజనులో 152 మందికి అవకాశం
- అర్జీల దాఖలుకు 30వ తేదీ వరకు గడువు



సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ

తెనాలి: రాష్ట్రప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాల శాఖ ఈ నెల 3వ తేదీన జారీ చేసిన జీవో నెం.32 ప్రకారం తెనాలి డివిజనులోని ఎనిమిది మండలాల్లో నోటిఫికేషన్‌లో పేర్కొన్న చౌకధరల దుకాణాలకు డీలర్లను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్టు తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. డివిజనులోని కాకుమాను, పొన్నూరు, తెనాలి, చేబ్రోలు, దుగ్గిరాల, కొల్లిపర, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో డీలర్ల ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. వీటిలో వివిధ కారణాలతో ఖాళీ అయిన దుకాణాలు 81, కొత్తగా ఏర్పాటు చేసినవి 71 కలిపి మొత్తం 152 మంది రేషను డీలర్లను నియమించనున్నారు. నిర్దేశించిన నమూనాలో దరఖాస్తులను తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నేరుగా ఇవ్వొచ్చన్నారు. రిజిస్టరు పోస్టు ద్వారా కూడా పంపొచ్చని తెలిపారు. అభ్యర్థుల వయసు 18 - 40 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. రాత పరీక్ష 80 మార్కులు, ఇంటర్వ్యూ 20 మార్కులకు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వచ్చిన అర్జీల సంఖ్యను అనుసరించి 5వ తేదీన సంబంధిత అధికారి నిర్ణయించిన ప్రదేశంలో ఉదయం 9.30 గంటలకు రాతపరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షా సమయం రెండు గంటలని, కేంద్రం, సమయం వివరాలను రెండు రోజుల ముందు అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు ఒరిజినల్‌తో గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని వివరించారు. రాత పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థుల ఫలితాలను 1:5 నిష్పత్తిలో అదేరోజు సాయంత్రం ప్రకటిస్తారు. మరుసటిరోజు ఉదయం 10 గంటల్నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని పొదుపు భవన్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని స్పష్టంగా తెలిపారు. సివిల్/క్రిమినల్ కేసులు నమోదై ఉండరాదని, స్థానిక ప్రజాప్రతినిధులు అర్హులు కాదని వివరించారు.

సంక్షేమం అనే పదానికి అర్థం చెప్పిన నేత వైఎస్ జగన్



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి

నెహ్రూనగర్: రాష్ట్రంలో సంక్షేమం అనే పదానికి అర్థం చెప్పిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చంద్రమౌళి నగర్‌లో కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్ జగన్ పాలనలో పేద ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందించి వారికి అన్ని విధాలుగా అండగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవుతు వంశీరెడ్డి, శ్రీకాంత్, ఆళ్ల కౌశిక్, ఆళ్ల లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.